నీట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందన

కాగజ్‌నగర్, జూన్ 6: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సహస్రకు కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలీ సేవా సంఘం గురువారం అభినందించారు. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 560 మార్కులు సాధించినందుకు విద్యార్థినితో పాటు తల్లిదండ్రులకు అభినందించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజ సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం ప్రతినిధులున్నారు.

నీట్‌లో మండల వాసికి 820వ ర్యాంక్

చింతలమానేపల్లి, జూన్ 6 : మండలంలోని లంబాడీహెట్టి గ్రామానికి చెందిన అజ్మీరా భీముడు, సావిత్రి దంపతుల కుమార్తె శైలజ ఇటీవల వెలువడిన నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చింది. మొత్త 720 మార్కులకు గాను 580 మార్కులు సాధించడంతో ఆలిండియా ఎస్టీ కేటగిరిలో 820వ ర్యాంకు సాధించింది. అజ్మీరా శైలజ 1 నుంచి 5వ తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదు నుంచి పదో తరగతి సిర్పూర్‌లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో, ఇంటర్మీడియెట్ టీఎస్ ఆర్జేసీ నిర్మల్‌లో పూర్తి చేసింది. నీట్ ఫలితాల్లో మంచి ఫలితాన్ని సాధించి వైద్య విద్యకు ఎంపిక కావడంపై మండలంలోని పలువురు శైలజను అభినందించారు.

దహెగాం కళాశాలకు ఎంపీసీ కోర్సు మంజూరు

దహెగాం,జూన్ 6 : దహెగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎంపీసీ గ్రూప్ మంజూరైనట్లు ప్రిన్సిపాల్ అమరేందర్ తెలిపారు. ప్రస్తుతం సీఈసీ, బీపీసీ గ్రూపులున్నాయని, ఎంపీసీ చదివేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టి ఉంచుకొని కళాశాలకు ఎంపీసీ కోర్సు మంజూరు కోసం ఇంటర్ మీడియట్ విద్యాశాఖ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేయడంతో పాటు పలుమార్లు విన్నవించినట్లు తెలిపారు. దీంతో అధికారులు ఎంపీసీ కోర్సును మంజూరు చేశారని తెలిపారు. దహెగాం జూనియర్ కళాశాలలో అందించే కోర్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

14న జడ్పీ సమావేశం

నస్పూర్, జూన్ 6 : జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

లక్షెట్టిపేట, జూన్ 6: లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్రబోర్ జాతీయ రహదారిపై గురువారం ఆటో ఢీ కొట్టడంతో గంపలపల్లికి చెందిన చంద మీనమ్మ(76) మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపాడు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మ్యాదరి బుట్టలు విక్రయిస్తూ ఉపాధి పొందేది. లక్షెట్టిపేటకు వచ్చి బుట్టలు విక్రయించి తిరిగి నడుచుకుంటూ వస్తుండగా ఊత్కూర్ చౌరస్తా నుంచి కరీంనగర్ చౌరస్తా వైపు వెళ్తున ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్ర గాయాలవడంతో మంచిర్యాల దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కొడుకు శంకరయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ-2 రామయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నాడు.

వృద్ధుడి మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు !

సీసీసీ నస్పూర్, జూన్ 6: మంచిర్యాల జిల్లా సీసీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొరగారిపల్లె గ్రామానికి చెందిన బోరె గంగులు(80) వృద్ధుడి మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. దొరగారిపల్లెకు చెందిన గంగులు చాలా ఏళ్లక్రితం ఉపాధి కోసం బొంబాయి వెళ్లాడు. అక్కడ పనిచేస్తూ కొడుకు, కూతుళ్ల వివాహాలు చేశాడు. భార్య చాలా ఏళ్ల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి కొన్ని రోజులు ఐదు గురు కూతుళ్ల వద్ద ఉన్నాడు. 6 నెలలుగా స్వగ్రామంలో కొడుకు-కోడలుతో కలిసి ఉంటున్నాడు. నెల క్రితం కొడుకు-కోడలు మంచిర్యాలకు వెళ్లగా, అప్పటి నుంచి గంగులు ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో రెండు మూడు రోజులుగా ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో బుధవారం స్థానికులు వెళ్లి చూడగా ఇంటికి వెనుక వైపు గంగులు మృతదేహం కనిపించింది. ఇంట్లో ఆయన మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. కాగా, గురువారం కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

చెన్నూర్‌లో బడిబాట ర్యాలీ తీస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

కెరమెరి : మోడి గ్రామంలో ర్యాలీ తీస్తున్న కేజీబీవీ ఎస్‌వో మీనా, సిబ్బంది, విద్యార్థులు

తాండూర్: కిష్టంపేట పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

ఊరూరా బడిబాట ప్రారంభం

మంచిర్యాలలో తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ మారుతీ ప్రసాద్

దహెగాం : ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు సెక్టోరల్ అధికారి మధూకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

మంచిర్యాలటౌన్, జూన్ 6: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, మెప్మా సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు కలిసి ర్యాలీలు తీసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మెప్మా టీఎంసీ చంద్రయ్య, సీవో సుజాత, అరుణ, సరోజ, ఆర్పీలు, పాల్గొన్నారు.

కోటపల్లిలో..

కోటపల్లి, జూన్ 6 : కోటపల్లి మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. పాఠశాలలో గ్రామ సమాఖ్య సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు, సమావేశమై పాఠశాలలోని సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలని ఉపాధ్యాయులు సూచించారు. అనంతరం గ్రామాల్లో అవగాహన ర్యాలీలను తీశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్ ఎంలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో

చెన్నూర్, జూన్ 6: చెన్నూర్‌లో బడిబాట కార్యక్రమాన్ని గురువారం అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ర్యాలీ తీశారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ గంగాధర్, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.

మందమర్రి, జూన్ 6: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించి అవగాహన కల్పించాలని మందమర్రి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మెప్మా ఆర్పీలకు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆర్పీలతో సమావేశం నిర్వహించి బడిబాటపై పలు సూచనలు చేశారు. అనంతరం విద్యానగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలోఫర్‌కు ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ రఘురాం, ఎమ్మార్పీ సదయ్య, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని నార్లాపూర్ ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ తీశారు. అనంతరం పాఠశాలలో ప్రతిజ్ఞ చేశారు.

వేమనపల్లిలో..

వేమనపల్లి, జూన్ 6 : వేమనపల్లి మండల కేంద్రంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. బడీడు, బడి మానేసిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. అనంతరం బడిబాట ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, ఎంఎస్‌వో శ్రీధర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, హెడ్ మాస్టర్ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, వీవో లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్‌లు రాణి, మధునక్క తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లిలో..

కన్నెపల్లి, జూన్ 6 : కన్నెపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబాట ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కజ్జం రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాండూర్‌లో..

తాండూర్, జూన్ 6 : తంగళ్లపల్లి హైస్కూల్, ప్రైమరీ పాఠశాలలో నిర్వహించిన బడి బాట కార్యక్రమంపై సమావేశంలో మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ 19వ తేదీ వరకు బడీడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తంగళ్లపల్లి పాఠశాల హెచ్ఎం, మండల నోడల్ అధికారి ఎస్ మల్లేశం, మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాలల చైర్మన్లు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ నోట్ బుక్స్, బ్యాగ్ ఫ్రీగా ఇస్తాం..

బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కిష్టంపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాసాడి శ్రీరాములు మాట్లాడుతూ నిరుపేద ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తే పిల్లలకు నోట్ బుక్స్, బ్యాగ్ ఫ్రీ గా తమ సొంత ఖర్చులతో ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మధు నమ్మ, ఉపాధ్యాయులు శ్రీను, మల్లీశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి, జూన్ 6 : మండలంలోని అన్ని పాఠశాలల్లో బడి బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ తీసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీ భవిత కేంద్రం వెంకటేశ్వర్‌రావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్‌పీలు, పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, జీపీ కార్యదర్శులు ఉన్నారు.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..

కెరమెరి, జూన్ 6: మండలంలోని కేజీబీవీతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీలు తీశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ అధికారి మీనా, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజలున్నారు.

కౌటాల మండలంలో..

కౌటాల, జూన్ 6 : మండలంలోని ముత్తంపేటలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని జడ్పీఎస్ఎస్ హెచ్ఎం గావుడే హన్మంతు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు విఓ మౌనిక, సీసీ విలాస్, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం, జూన్ 6: మండలంలోని ఇట్యాలలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు సెక్టోరల్ అధికారి కటుకం మధుకర్ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. బడీడు, బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవిశంకర్, సుధాకర్, ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, తదితరులున్నారు.

చింతలమానేపల్లిలో

చింతలమానేపల్లి, జూన్ 6 : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయుడు జయరాజ్, కార్యదర్శులు ఆసిఫ్ అలీ, విజయ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్‌లో..

హాజీపూర్, జూన్ 6 : మండలంలోని ముల్కల్ల గ్రామంలో బడి బాట ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొమ్మ గణపతిరెడ్డి, ఉపాధ్యాయులు గ్రామ కమిటీ సభ్యులు, సెల్ఫ్ హెల్ప్ సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్‌లో..

రామకృష్ణాపూర్, జూన్ 6: ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివించాలని క్యాతనపల్లి మున్సిపాలిటీలోని విద్యార్థుల తల్లిదండ్రులను మండల విద్యాధికారి జాడి పోచయ్య, మున్సిపల్ కమిషనర్ ఎన్. మురళీకృష్ణ కోరారు. బడిబాట కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఏ. శ్రీధర్, టీఎంసీ(మెప్మా) పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు, కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో పోచయ్య

నస్పూర్, జూన్ 6 : మంచిర్యాల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్, కేజీబీవీలకు సంబంధించిన పుస్తకాల పంపిణీని గురువారం ఎంఈవో పోచయ్య ప్రారంభించారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు పుస్తకాలను అందజేశారు. మంచిర్యాల మండలంలో మొత్తం 30 ప్రభుత్వ పాఠశాలలున్నాయని, వీటిలో ప్రాథమిక పాఠశాలలు 21, ప్రాథమికోన్నత పాఠశాల 1, ఉన్నత పాఠశాలలు 6, మోడల్ స్కూల్ 1, కేజీబీవీ ఒకటి ఉన్నాయని తెలిపారు. పాఠశాలలు ప్రారంభం రోజునే ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పుస్తకాలను అందించాలన్నారు.

మందమర్రి మండలంలో..

పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రాజేశ్వర్

మందమర్రి రూరల్, జూన్ 5 : మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం(ఎంఈవో)ఆఫీసులో పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల పుస్తకాలు, డ్రెస్ మెటీరియల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మందమర్రి ఎంపీడీవో రాజేశ్వర్ అందజేశారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలల్లో అభివృద్ధి కమిటీలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

వేమనపల్లి, జూన్ 6 : మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్దం చేయాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి సూచించారు. గురువారం వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణ, ఉపాధి హామీ పనులపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీవో సత్య ప్రసాద్, ఈసీ మధుకర్ తదితరులున్నారు.

బెల్లంపల్లి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌పై ఫిర్యాదు

కాసిపేట, జూన్ 6 : బెల్లంపల్లి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌పై తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ తెలిపారు. మూడు నెలల నుంచి ఆర్టీఏ అప్లికేషన్లు చేస్తున్నా వాటిని పట్టించుకోవడం లేదని, లేబర్ ఆఫీసులో డెత్ స్కీమ్స్, మ్యారేజ్ స్కీమ్స్, డెలివరీ స్కీమ్స్, తదితర అంశాలపై సమాచారం అడిగితే ఇవ్వడంలేదన్నారు. ఈ విషయంపై అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇందిరానగర్ ఆలయంలో పూజలు

శని భగవానుడికి పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన, జూన్ 6: రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో కొలువైన కనకదుర్గా దేవి స్వయంభూ మహంకాళి ఆలయ ప్రాంగణంలో గురువారం పంచ గ్రహ కూటమి సందర్భంగా శని భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్ తెలిపారు.

కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్

మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎంవీ రమేశ్

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 6: రాజీ మార్గంలో కేసులను పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తున్నదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ అన్నారు. జూనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి యువరాజ్‌తో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8న రెండవ నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సివిల్, క్రిమినల్, సైబర్ క్రైమ్, మోటార్ యాక్ట్ తదితర కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. వృద్ధాప్యంలో ఉండి లోక్‌దాలత్‌కు హాజరు కానీ వారు ఆన్‌లైన్ ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 3 నుంచి ప్రీ లోకల్ అదాలత్ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఫిబ్రవరి 16న నిర్వహించిన మొదటి నేషనల్ లోకల్ అదాలత్‌లో 2346 కేసులను రాజీమార్గంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆసిఫాబాద్ కోర్టులో మూడు బెంచ్‌లు, సిర్పూర్(టీ) కోర్టులో ఒక బెంచ్ ఏర్పాటు చేసి రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్లో నమోదైనప్పటికీ కోర్టులో హాజరుపరచని కేసులను సైతం లోక్ అదాలత్‌లో నేరుగా ప్రవేశపెట్టి రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

నస్పూర్ : వీసీలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు

ఆసిఫాబాద్ : వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, జూన్ 6 : ఈ నెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి, టీజీపీఏ రవి గుప్తాతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న గ్రూప్-1 పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. శుక్రవారం పరీక్షకు సంబంధిత పత్రాలు, సామగ్రి స్ట్రాంగ్ రూంలకు చేరవేశామని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్‌రూం నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించడంతో పాటు పరీక్ష ముగిసిన తర్వాత హైదరాబాద్ పంపించే సమయంలో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు జిల్లాల వారీగా సమకూర్చడం జరిగిందని, రైతులకు ఇబ్బంది కలగకుండా పంపిణీ చేయాలన్నారు. మిషన్ భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందించాలన్నారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ కలెక్టర్లు కలెక్టర్ బదావత్ సంతోష్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్లు రాహుల్, దీపక్ తివారీ, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వరరావు, మిషన్ భగీరథ ఈఈ వెంకటేశ్, జిల్లా వ్యవసాయాధికారి సురేఖ, డీఈవో యాదయ్య, డీపీవో వెంకటేశ్వర్‌రావు, ప్రాంతీయ సమన్వయ కర్త చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- లక్షెట్టిపేట సీనియర్ సివిల్ జడ్జి అర్పితా మారంరెడ్డి

లక్షెట్టిపేట : మొక్కలను నాటుతున్న జడ్జి అర్పితామారం రెడ్డి

జైపూర్ గురుకులంలో మొక్కలు నాటుతున్న డీఆర్వో సాగరిక

లక్షెట్టిపేట, జూన్ 6: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లక్షెట్టిపేట కోర్టు అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పితా మారంరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణ న్యాయస్థానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ మానవాళి మనుగడకు చెట్లు చాలా అవసరమని తెలిపారు. అనంతరం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి అబ్దుల్ హజార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్, ఏజీపీ పద్మ, న్యాయవాదులు రాజేశ్వర్ రావు, కారుకూరి సురేందర్, గాండ్ల సత్యనారాయణ, తిరుపతి స్వామి, నళినికాంత్, వేల్పుల సత్యం, రెడ్డిమల్ల ప్రకాశం, సుమన్ చక్రవర్తి, గణేశ్, సజని, మల్లికార్జున్‌తో పాటు అటవీశాఖ, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించాలి

జైపూర్, జూన్ 6: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని డీఆర్వో సాగరిక అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్వో రాంసింగ్, ఎఫ్‌బీవో సతీశ్, ఎఫ్‌బీవో దీక్ష, పంచాయతీ సెక్రటరీ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన వివేక్ కుటుంబం

ముఖ్యమంత్రికి శాలువా కప్పుతున్న వివేక్, వంశీ

మంచిర్యాలటౌన్, జూన్ 6: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, ఆయన భార్య సరోజ, కొడుకు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీతో కలిసి గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీగా గెలుపొందిన వంశీని రేవంత్ ప్రత్యేకంగా అభినందించారు.

రక్తదానం

డొనేషన్ పత్రాన్ని అందజేస్తున్న అధికారి

మంచిర్యాల ఏసీసీ, మే 6: మందమర్రి పట్టణానికి చెందిన దామెర అభిలాష్ తన 27 వ పుట్టిన రోజు సందర్భంగా తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ దవాఖానలో మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేశారు. ఆయనకు బ్లడ్ డొనేషన్ పత్రాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ కోశాధికారి సత్యపాల్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ సూపర్‌వైజర్ కందుల మాధవి, పీఆర్వో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మంచిర్యాల జట్టు

కాసిపేట, జూన్ 6 : బెల్లంపల్లి